రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ అసత్య ఆరోపణలు





# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd


డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటానికి ఎమ్మెల్యే మద్దతివ్వాలి





Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 296 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 20 అక్టోబర్ 2026





పాఠకులకు ప్రకటనకర్తలు శ్రేయోభిలాషులకు

విజయ దశమి శుభాకాంక్షలు

నేడు దసరా పర్వదినం సందర్భంగా పత్రికా కార్యాలయానికి సెలవు. కావున రేపు (21 అక్టోబర్ బుధవారం ) సంచిక వెలువడదు .. (పునర్దర్శనం గురువారం )


## పారిశ్రామికాభివృద్ధికి శాంతిభద్రతలే కీలకం!

● ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణ గమ్యస్థానం కావాలి ● ఫ్యూచర్ సిటీలో పోలీస్ కమిషనరేట్ ప్రారంభం ● రూ.200 కోట్లతో ఎన్ఐయూఎం నూతన ప్రాంగణం ● డిసెంబర్ 7 నుంచి 9 వరకు ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్



**హైదరాబాద్,అక్టోబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి శాంతిభద్రతల పరిరక్షణే ప్రధానమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ విధానాల్లో చిత్తశుద్ధి, ఆధునిక పోలీసు వ్యవస్థ సమర్థంగా పనిచేస్తేనే ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షించగలమని తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికతో పనిచేస్తోందని పేర్కొన్నారు.సోమవారం భారత్ ఫ్యూచర్ సిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయ భవన సముదాయాన్ని ప్రారంభించారు. అనంతరం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐయూఎం) నూతన ప్రాంగణ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, వేగవంతమైన పోలీసు సేవలు అందించడమే కమిషనరేట్ ప్రధాన లక్ష్యమని వివరించారు. **ఆధునిక సాంకేతికతతో పోలీసు సేవలు**కృత్రిమ మేధ, సైబర్ నేరాల దర్యాప్తు, డిజిటల్ ఆధారాల విశ్లేషణ, మహిళల భద్రత వంటి అంశాలపై మిగతా2లో...



## ఎల్‌నినోపై అప్రమత్తంగా ఉండాలి!

● తాగునీరు, విద్యుత్ కొరత రాకుండా ముందస్తు ప్రణాళికలు ● అక్రమ నీటి మోటార్ల తొలగింపు.. తాగునీటి అవసరాలకే బోరుబావుల అనుమతులు

**హైదరాబాద్,అక్టోబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తాగునీరు, విద్యుత్ కొరత ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. జిల్లాలతో పాటు మండల స్థాయిలోనూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంపై సోమవారం సీనియర్ మిగతా2లో...

## ఎల్‌నినో పరిస్థితులపై అధ్యయనానికి కేబినెట్ ఉపసంఘం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన కమిటీ ఏర్పాటు




## భూ వివాదాల శాశ్వత పరిష్కారమే లక్ష్యం

- రైతుల హక్కుల పరిరక్షణకు భూభారతి.. అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశాలు



**హైదరాబాద్,అక్టోబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. భూభారతి, రెవెన్యూ శాఖ అధికారులతో సోమవారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. రైతుల భూమి హక్కులకు భద్రత కల్పించడంతోపాటు రెవెన్యూ సేవల్లో పారదర్శకత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భూభారతి చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి పట్టాదారు పాస్‌పుస్తకాల జారీ, భూముల పునఃసర్వే, పెండింగ్ భూ సమస్యల పరిష్కారంపై మంత్రి సమీక్షించారు. అర్హులైన రైతులకు భూమి హక్కు పత్రాలు అందేలా మిగతా2లో...

## యెమెన్‌లో హౌతీల క్షిపణి దాడి.. 53 మంది మృతి!

● సైనిక శిక్షణ శిబిరంపై మూడు బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపాటు ● 200 మందికి పైగా గాయాలు



**షబ్వా,అక్టోబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** యెమెన్‌లో మరోసారి హింస చెలరేగింది. ప్రభుత్వ భద్రతా దళాల శిక్షణ శిబిరంపై హౌతీ తిరుగుబాటు దారులు బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేశారు. ఈ ఘటనలో కనీసం 53 మంది మృతి చెందగా, మరో 200 మందికి పైగా గాయపడ్డారు. దక్షిణ యెమెన్‌లోని షబ్వా ప్రావిన్స్‌లో సోమవారం ఈ దాడి జరిగినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. సైనిక శిక్షణ జరుగుతున్న సమయంలో మూడు క్షిపణులు శిబిరాన్ని తాకినట్లు సమాచారం. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. హౌతీ ప్రతినిధులు దాడికి బాధ్యత ప్రకటిస్తూ, ఆ శిబిరంలో సౌదీ అధికారుల ఆధ్వర్యంలోని బలగాలు ఉన్నాయని పేర్కొన్నారు. అయితే, దీనికి సంబంధించి వారు ఆధారాలు వెల్లడించలేదు. మిగతా2లో...



## అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక దసరా

- ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,అక్టోబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** అధర్మంపై ధర్మం, చెడుపై మంచి సాధించిన విజయానికి విజయదశమి ప్రతీకగా నిలుస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సంస్కృతి, మిగతా2లో...

## ఉక్రెయిన్‌తో ఘర్షణకు చెక్!

- ట్రంప్, జిన్‌పింగ్‌లతో త్రైపాక్షిక భేటీకి పుతిన్ ప్రతిపాదన
- నవంబర్‌లో శిఖరాగ్ర సమావేశానికి యత్నాలు




## కనకదుర్గమ్మ ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి చెందాలి

- ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు




## కేసీఆర్ ఫామ్‌హౌస్ వివాదం..

ముగ్గురు కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ నోటీసులు!

కొండపోచమ్మ సాగర్ నీటి మళ్లింపుపై ఆరోపణలు

సామాజిక మాధ్యమాల్లో పోస్టులు తొలగించాలని డిమాండ్







## సింగరేణి అధికారులకు వేతనాల పెంపు.. దసరా కానుక!

- 1,800 మంది అధికారులకు ప్రయోజనం.. అక్టోబర్ జీతాల నుంచే అమలు

# ఉక్రెయిన్‌తో ఘర్షణకు చెక్!

**మాస్కో,అక్టోబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** రష్యాఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే దిశగా కీలక పరిణామం చోటుచేసుకున్నట్లు అంతర్జాతీయ కథనాలు వెల్లడించా యి. ఉక్రెయిన్‌తో వివాదంపై చర్చించి, రష్యాకు అనుకూలమైన శాంతి ఒప్పందం కుదుర్చుకునే లక్ష్యంతో వచ్చే నెలలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో త్రైపాక్షిక సమావేశం నిర్వహించాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రతిపాదించినట్లు సమాచారం.అక్టోబర్ 9న ట్రంప్‌తో జరిగిన ఫోన్ సంభాషణలో పుతిన్ ఈ ఆలోచనను ప్రస్తావించినట్లు నివేదిక పేర్కొంది. నవంబర్ 18, 19 తేదీల్లో చైనాలోని షెన్‌జెన్‌లో జరగనున్న ఆసియాపసిఫిక్ ఆర్థిక సహకార సదస్సు సందర్భంగా ఈ చర్చలు నిర్వహించే అవకాశాన్ని రష్యా పరిశీలిస్తున్నట్లు తెలిపింది. అయితే, ఈ సమావేశానికి ట్రంప్ ఇంకా అధికారికంగా అంగీకరించలేదు. చైనా కూడా ట్రంప్ పాల్గొంటే అభ్యంతరం ఉండబోదని సంకేతాలు ఇచ్చినట్లు సమాచారం.ఈ ప్రతిపాదనపై ఉక్రెయిన్, అమెరికాయూరోపియన్ దేశాల మిత్రపక్షాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా శాంతి చర్చల్లో ఉక్రెయిన్‌కు ప్రాతినిధ్యం లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.మరోవైపు, రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు జరుగుతున్న చర్చల్లో గణనీయమైన పురోగతి సాధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు.

అయితే, త్రైపాక్షిక సమావేశం ఖరారైందా, దాని ద్వారా ఒప్పందం కుదురుతుందా అనే అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

# కేసీఆర్ ఫామ్‌హౌస్ వివాదం..

**హైదరాబాద్, 19(పిసిడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఫామ్‌హౌస్‌కు కొండపోచమ్మ సాగర్ నీటిని మళ్లించారంటూ వస్తున్న ఆరోపణలపై రాజకీయ వివాదం ముదురుతోంది. ఈ వ్యవహారంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణలకు బీఆర్ఎస్ న్యాయ విభాగం నోటీసులు జారీ చేసింది.బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, న్యాయ విభాగం ఇన్‌ఛార్జి సోమ భరత్ కుమార్ ఈ నోటీసులు పంపించినట్లు సమాచారం. కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ అంశంపై ఇప్పటికే ఓ తెలుగు దినపత్రిక యాజ మాన్యానికి, సంపాదకుడికి నోటీసులు పంపించినట్లు పార్టీ వెల్లడించింది.సంబంధిత ఆరోపణలతో తమ సామాజిక మాధ్యమ ఖాతాల్లో చేసిన పోస్టులను వెంటనే, బేషరతుగా తొలగించాలని, ఆరోపణలను ఉపసంహరించుకోవాలని ముగ్గురు కాంగ్రెస్ నేతలను బీఆర్ఎస్ న్యాయ విభాగం కోరింది. సాగునీటి ప్రాజెక్టులపై ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించ బోమని హెచ్చరించింది.నోటీసులకు స్పందించక పోతే పరువునష్టం సహా వర్తించే చట్టాల ప్రకారం తదుపరి న్యాయపరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేసింది. కాంగ్రెస్ నేతల స్పందన, ఆరోపణలకు సంబంధించిన వాస్తవాలు తదుపరి పరిణామాల్లో కీలకం కానున్నాయి.

# పారిశ్రామికాభివృద్ధికి శాంతిభద్రతలే కీలకం!

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని సీఎం తెలిపారు. ఇప్పటికే 210 మందికి పైగా పోలీసు అధికారులు, సిబ్బంది కృత్రిమ మేధ వినియోగంపై ప్రత్యేక శిక్షణ పూర్తి చేశారని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ విస్తరణకు అనుగుణంగా పోలీసు జోన్లు, డివిజన్లు, మహిళా పోలీస్ స్టేషన్లు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

**రూ.200 కోట్లతో ఎన్ఐయూఎం ప్రాంగణం** భారత్ ఫ్యూచర్ సిటీలో 20 ఎకరాల స్థలంలో సుమారు రూ.200 కోట్ల అంచనా వ్యయంతో ఎన్ఐయూఎం నూతన ప్రాంగణాన్ని నిర్మించనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. 2028 జూన్ 2 నాటికి నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పర్యావరణహితంగా, నెట్‌జీరో లక్ష్యంతో ఈ ప్రాంగణాన్ని రూపొందించనున్నారు. భవనాలపై సౌర విద్యుత్ వ్యవస్థలు, సౌరశక్తితో నీటిని వేడి చేసే సదుపాయాలు, ఎల్ఈడీ దీపాలను ఏర్పాటు చేయనున్నారు.

**పట్టణ పాలనపై పరిశోధనలు.. అధికారులకు శిక్షణ** ఈ ప్రాంగణంలో పట్టణ పాలన, ఆర్థిక వనరుల సమీకరణ, మౌలిక సదుపాయాలు, పట్టణ రవాణా, సామాజిక-ఆర్థిక అభివృద్ధి, వాతావరణ మార్పుల ప్రభావాల తగ్గింపు తదితర అంశాలపై పరిశోధనలు చేపట్టనున్నారు. కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కేంద్రాన్ని, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇచ్చేందుకు సామర్థ్యాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. శిక్షణార్థులు, పరిశోధకులు, నిపుణుల కోసం 122 నివాస గదులను నిర్మించనున్నారు. ఎన్ఐయూఎం ఇప్పటివరకు 6,000 మందికి పైగా ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణ అందించిందని సీఎం తెలిపారు. పట్టణాల అభివృద్ధి, ప్రణాళికల రూపకల్పన, ఘన వ్యర్థాల నిర్వహణ వంటి రంగాల్లో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.

**గ్లోబల్ సమ్మిట్‌కు విస్తృత ఏర్పాట్లు** డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026' ఏర్పాట్లను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. దేశ, విదేశాల నుంచి పారిశ్రామికవేత్తలు హాజరయ్యేలా అంతర్జాతీయ స్థాయి ఏర్పాట్లు చేయాలని సూచించారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన, నిర్దేశిత గడువుకు ముందే పనులు పూర్తి చేయాలని, నవంబర్ నెలాఖరులోగా సమ్మిట్ ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించడం, పారిశ్రామికాభివృద్ధికి భరోసా ఇవ్వడం, ఆధునిక పోలీసు వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా రాష్ట్రాన్ని ప్రపంచ పెట్టుబడులకు ఆకర్షణీయ కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం వివరించారు. ఈ కార్యక్రమాల్లో పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోపై అప్రమత్తంగా ఉండాలి!

(మొదటి పేజీ తరువాయి)

ఐఏఎస్ అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో పరిస్థితులను సమీక్షించారు.రాష్ట్రంలో వ్యవసాయ, గృహ అవసరాలకు విద్యుత్ సరఫరా కొనసాగుతోందని, పరిశ్రమలకు విద్యుత్ కోతలు విధించడం లేదని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని ఆదేశించారు. అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తిని గరిష్ఠ స్థాయికి పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. యాదాద్రి థర్మల్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.

**అక్రమ నీటి మోటార్లపై ప్రత్యేక నిఘా** స్థానిక నీటి వనరుల నుంచి అక్రమంగా మోటార్లతో నీటిని తోడటం వల్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక భారం పడుతోందని అధికారులు వివరించారు. హైదరాబాద్‌లో నల్లాలకు అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడే వారిపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. హైడ్రా తదితర సంస్థల సహకారంతో అక్రమ మోటార్లను తొలగిస్తున్నట్లు వెల్లడించారు.

**తాగునీటి అవసరాలకే బోరుబావుల తవ్వకాలు** హైదరాబాద్‌లో నిబంధనల ప్రకారం తాగునీటి అవసరాలకే కొత్త బోరుబావుల తవ్వకాలకు అనుమతించాలని అధికారులు స్పష్టం చేశారు. నిర్మాణ పనుల కోసం కొత్త బోర్లు వేయడానికి అనుమతులు ఇవ్వవద్దని సూచించారు. ఇప్పటికే ఉన్న బోరుబావులను తాగునీటి అవసరాల కోసం మరింత లోతుగా తవ్వేందుకు నిబంధనల మేరకు అనుమతిస్తామని తెలిపారు. నవంబర్ 1 నుంచి నిర్మాణ పనులకు శుద్ధి చేసిన మురుగునీటిని ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు.రంగారెడ్డి జిల్లాలో భూగర్భ జలాల మట్టం తగ్గుతున్న నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇతర జిల్లాల్లోనూ తాగునీరు, పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ఎల్‌నినో ప్రభావంపై త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించడంతో పాటు మంత్రివర్గ ఉపసంఘం సమావేశం కూడా ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# ప్రాణహిత జలాల కోసం కవిత పోరుబాట!

**నవంబర్ నెలాఖరులోగా కాఫర్ డ్యాం పనులు ప్రారంభించాలి**

**కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కవిత డిమాండ్**

**కన్నెపల్లి,అక్టోబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కాఫర్ డ్యాం నిర్మాణ పనులను నవంబర్ నెలాఖరులోగా ప్రారంభించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రాణహిత నది నీటిని రైతులకు ఉపయోగపడేలా మళ్లించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన కవిత, అందుబాటులో ఉన్న గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మేడిగడ్డ బ్యారేజీ సమస్యను సాకుగా చూపకుండా రైతులకు సాగునీరు అందించే ప్రత్యామ్నాయ మార్గాలను



పరిశీలించాలని అన్నారు. సుమారు రూ.25 కోట్లతో నెలన్నర రోజుల్లో కాఫర్ డ్యాం పనులు పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు.ప్రభుత్వం నవంబర్ నెలాఖరులోగా పనులు ప్రారంభించకపోతే కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ఆందోళన చేపడతామని కవిత హెచ్చరించారు. రైతుల సమస్యలను రాజకీయాలకు అతీతంగా పరిష్కరించి, సాగునీటి కొరత నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## యెమెన్‌లో హౌతీల క్షిపణి దాడి.. 53 మంది మృతి!

(మొదటి పేజీ తరువాయి)

యెమెన్‌లో ప్రభుత్వ బలగాలు, హౌతీ తిరుగుబాటుదారుల మధ్య ఇటీవలి కాలంలో ఘర్షణలు తీవ్రతరమయ్యాయి. గతంలో కొనసాగిన కాల్పుల విరమణ ఒప్పందం విచ్ఛిన్నం కావడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. తాజా దాడితో ప్రాంతంలో భద్రతాపరమైన ఆందోళనలు పెరిగాయి.

## అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక దసరా

(మొదటి పేజీ తరువాయి)

సంప్రదాయాల్లో దసరా పండుగకు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు.దసరా పండుగ ధైర్యం, ధర్మం, సత్యం, ఐక్యత, ఆత్మవిశ్వాసం వంటి విలువలను నేర్పుతుందని సీఎం పేర్కొన్నారు. అహంకారం, అసూయ, ద్వేషం, అన్యాయం వంటి ప్రతికూల భావాలను విడిచిపెట్టి ప్రేమ, కరుణ, సోదరభావం, మానవత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.మహిషాసురుడిపై దుర్గాదేవి సాధించిన విజయం, రావణుడిపై శ్రీరాముడి గెలుపు ధర్మానికి ఉన్న శక్తిని చాటిచెబుతాయని తెలిపారు. తెలంగాణలో జమ్మిచెట్టును పూజించడం, జమ్మి ఆకులను బంగారంగా భావించి పెద్దలకు అందించి ఆశీర్వాదాలు తీసుకోవడం వంటి సంప్రదాయాలు ప్రకృతిని గౌరవించడం, పెద్దలను ఆదరించడం నేర్పుతాయని పేర్కొన్నారు.ఈ విజయదశమి ప్రతి ఇంటా ఆనందం, సంతోషం, ఐశ్వర్యం నింపాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అభివృద్ధి, విజయాలు కలగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## కనకదుర్గమ్మ ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి చెందాలి

**- ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు**

**అమరావతి,అక్టోబర్19(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా పండుగ ప్రజలందరికీ గొప్ప స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. సోమవారం తన సామాజిక మాధ్యమ ఖాతా ద్వారా పండుగ సందేశాన్ని అందించారు.రైతుల శ్రమకు తగిన ఫలితం అందించడం, మహిళలకు సాధికారత కల్పించడం, యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి జగన్మాత ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ దీవెనలతో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకున్నారు.రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ముఖ్యమంత్రి మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ప్రజలందరికీ మరోసారి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎల్‌నినో పరిస్థితులపై అధ్యయనానికి కేబినెట్ ఉపసంఘం

**హైదరాబాద్:అక్టోబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను సమీక్షించి, వాటిని ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలను సూచించేందుకు తెలంగాణ ప్రభుత్వం కేబినెట్ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షత వహించనున్నారు. సభ్యులుగా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, దాసరి అనసూయ (సీతక్క), వాకిటి శ్రీహరి వ్యవహరించనున్నారు.ఎల్‌నినో పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, తాగునీటి కొరత, వ్యవసాయం, విద్యుత్ సరఫరాపై ప్రభావాన్ని అంచనా వేయడం, ముందస్తు చర్యలపై ప్రభుత్వానికి సిఫారసులు చేయడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

## సింగరేణి అధికారులకు వేతనాల పెంపు.. దసరా కానుక!




**హైదరాబాద్,అక్టోబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** సింగరేణి అధికారులకు ప్రభుత్వం దసరా కానుక అందించింది. కోల్‌ఇండియా తరహాలో ఎగ్జిక్యూటివ్ క్యాడర్ ఈ-1 నుంచి ఈ-7 వరకు పనిచేస్తున్న సుమారు 1,800 మంది అధికారులకు వేతన సవరణ చేస్తూ సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. సింగరేణి పర్సనల్ డైరెక్టర్ గౌతమ్ పోట్రు సోమవారం ఈ ఉత్తర్వులు విడుదల చేశా రు. సవరించిన ప్రాథమిక వేతనాలు 2017 జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చినట్లు పరిగణిం చనుండగా, ఆర్థిక ప్రయోజనాలు 2026 సెప్టెంబర్ 25 నుంచి వర్తించనున్నాయి. పెరిగిన వేతనా లను అక్టోబర్ నెల జీతాల నుంచే చెల్లించనున్నారు. కొత్త వేతన స్కేల్ ప్రకారం ఈ-1 క్యాడర్ ప్రాథ మిక వేతనం రూ.40 వేల నుంచి రూ.60 వేలకు, ఈ-2 క్యాడర్ రూ.50 వేల నుంచి రూ.70 వేలకు, ఈ-3 క్యాడర్ రూ.60 వేల నుంచి రూ.80 వేలకు, ఈ-4 క్యాడర్ రూ.70 వేల నుంచి రూ.90 వేలకు, ఈ-5 క్యాడర్ రూ.80 వేల నుంచి రూ.లక్షకు, ఈ-6 క్యాడర్ రూ.90 వేల నుంచి రూ.1.20 లక్షలకు పెరగనుంది. ఈ నిర్ణయంతో సింగరేణి అధికారులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరనుంది.

## భూ వివాదాల శాశ్వత పరిష్కారమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. భూముల వివరాల్లో ఉన్న లోపాలను సరిచేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.భూముల పునఃసర్వే ద్వారా దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నారాయణపురం గ్రామంలో 906 మంది రైతులకు 1,600 ఎకరాలకు పైగా భూమిపై హక్కులు కల్పించినట్లు వివరించారు. సూర్యాపేట జిల్లాలోని నూతనకల్, మద్దిరాల మండలాల పరిధిలో 15 గ్రామాలకు చెందిన 2,400 మంది రైతులకు 3,450 ఎకరాలకు సంబంధించి భూమి హక్కు పత్రాలు అందించినట్లు తెలిపారు.రైతులకు బ్యాంకు రుణాలు, రైతు భరోసా వంటి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా భూమి రికార్డులను క్రమబద్ధీకరించాలని అధికారులకు సూచించారు. భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయకుండా, అర్హులైన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు.

# రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ అసత్య ఆరోపణలు

**వాస్తవాలు తెలుసుకోకుండా విమర్శలు చేయడం సిగ్గుచేటు**

**గతం కంటే మెరుగ్గా బతుకమ్మ ఏర్పాట్లు చేశాం**

**చల్లా హరిశంకర్ వ్యాఖ్యలపై మండిపడ్డ బీజేపీ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ కౌంటర్..**




**కరీంనగర్, అక్టోబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** రాజకీయ లబ్ధి, ప్రచార ఆర్భాటం కోసమే బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తూ, ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారని బిజెపి కార్పొరేటర్ సోమిడి వేణు ఘాటుగా విమర్శించారు. బతుకమ్మ ఏర్పాట్లపై బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. సోమవారం స్థానిక ఎస్బిఎస్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమిడి వేణు మాట్లాడారు. పండగ సమయంలో ప్రతిపక్ష నాయకులు ప్రజలకు అండగా ఉండాల్సింది పోయి, ప్రచారం కోసం అవాస్తవాలు మాట్లాడటం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. గతం కంటే తమ పాలకవర్గం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బతుకమ్మ పండగ ఏర్పాట్లను ఎంతో ఘనంగా నిర్వహించిందని స్పష్టం చేశారు.**రూ. 3 కోట్లతో 28 బతుకమ్మ పాయింట్ల వద్ద సదుపాయాలు** బతుకమ్మ వేడుకల కోసం రూ. 3 కోట్ల నిధులు కేటాయించి, మొత్తం 28 బతుకమ్మ పాయింట్ల వద్ద అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశామని తెలిపారు. ఆడబిడ్డలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా లైటింగ్, సౌండ్ సిస్టమ్‌స్టోన్ డస్ట్ చదును, బారికేడింగ్ పారిశుధ్యం, మంచినీటి సదుపాయాలువంటి అన్ని సౌకర్యాలు కల్పించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిన్నటితో సద్దుల బతుకమ్మ వేడుకలను ప్రశాంత వాతావరణంలో గొప్పగా ముగించామని వివరించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సూచనల మేరకు తమ పాలకవర్గం, అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయడంలో సంపూర్ణంగా సఫలీకృతమయ్యామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పనులను చూడకుండా, ఉనికి చాటుకోవడం కోసం బీఆర్ఎస్ నాయకులు బురదజల్లే యత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ 10 ఏళ్ల పాలనలో దుర్గమాత నిమజ్జన ఉత్సవాలను ఎప్పుడైనా పట్టించుకున్నారా? అని సోమిడి వేణు ప్రశ్నించారు. తమ పాలకవర్గం చరిత్రలో మొదటిసారిగా దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గమాతల నిమజ్జనానికి కూడా భారీ ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. మానకొండూరు, కొత్తపల్లి చెరువులను ఎంపిక చేసి క్రేన్లు, బారికేడింగ్, తాగునీరు, పారిశుధ్యం వంటి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు. గతంలో గణేష్, బతుకమ్మ ఉత్సవాలను నామమాత్రంగా చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు.**8 నెలల్లోనే వందలాది కోట్ల నిధులు.. అభివృద్ధికి శ్రీకారం** తమ పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన 8 నెలల్లోనే వందలాది కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చి నగర అన్ని రంగాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటోందని, ఇవన్నీ ప్రజల కళ్ళముందే కనిపిస్తున్నాయని చెప్పారు. ప్రతిపక్ష నాయకులు కోడిగుడ్డు మీద ఈకలు పీకే రకంగా వ్యవహరించడం సిగ్గుచేటని, బతుకమ్మ పండగను సాకుగా మలచుకుని రాజకీయం చేయడం తగదని హితవు పలికారు. నిజాలు తెలుసుకుని మాట్లాడాలని సూచించారు.ఈ సమావేశంలో కార్పొరేటర్లు మేకల వెంకటేష్, ఏపీపీ చంద్ర, మాసం గణేష్, మండన్నా, గజే శివరాం, పవన్ కళ్యాణ్, సాయి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ స్ఫూర్తితో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

**ఎల్‌నినో ముప్పును ఎదుర్కొనేందుకు ఇప్పటినుంచే ముందస్తు కార్యాచరణ చేపట్టాలి**

**సౌర విద్యుత్ ఉత్పత్తి పెంచడంపై ప్రభుత్వం దృష్టి సారించాలి**

**ఈపీడీసీ ప్రతినిధులు ఎస్.సిహెచ్. రంగయ్య, డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి పిలుపు**



**హైదరాబాద్, అక్టోబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ప్రకృతితో మమేకమై జీవించాలని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలనే సందేశాన్ని ఇస్తుందని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఈపీడీసీ) పేర్కొంది. ప్రకృతి ప్రాధాన్యతను విస్మరించడం వల్లే నేడు మానవాళి అనేక పర్యావరణ సవాళ్లను ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేసింది.ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తీవ్ర విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉందని, ఈ పరిస్థితి తలెత్తకుండా తెలంగాణ ప్రభుత్వం తక్షణమే ముందస్తు కార్యాచరణకు శ్రీకారం చుట్టాలని ఈపీడీసీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.సిహెచ్. రంగయ్య, కౌన్సిల్ సలహాదారులు డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు.ఎల్‌నినో ప్రభావం పూర్తిస్థాయిలో చూపకముందే ఆందోళనకర పరిస్థితులు కనిపిస్తున్నాయని వారు గుర్తుచేశారు. ముంచుకొస్తున్న సవాళ్లను అధిగమించడానికి బొగ్గు ఆధారిత విద్యుత్‌పై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గిస్తూ, సౌర విద్యుత్‌తో పాటు ఇతర పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా విస్తృతంగా విద్యుత్ ఉత్పత్తి చేపట్టి ఇంధన భద్రత సాధించాలని సూచించారు. స్వచ్ఛమైన ఇంధన వనరుల వినియోగంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు.ప్రకృతి సమతుల్యత దెబ్బతిన్నప్పుడు నీరు, విద్యుత్ వంటి కీలక వనరులపై విపరీతమైన ఒత్తిడి పెరుగుతుందని, అలాంటి పరిస్థితులు రాకుండా చర్యలు తీసుకోవడమే సమర్థవంతమైన పాలనకు నిదర్శనమని వారు స్పష్టం చేశారు. వేగంగా అడుగంటుతున్న భూగర్భ జలాలను పెంపొందించేందుకు వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల నిర్మాణం, విస్తృతంగా మొక్కలు నాటి కాపాడటం వంటి చర్యలను ప్రజా ఉద్యమంగా మార్చాలని పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని కాపాడుకుంటేనే భావితరాలకు సురక్షితమైన భవిష్యత్తును అందించగలమని, ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం తక్షణమే సమగ్ర పర్యావరణ ప్రణాళికను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.



# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యం

**- మహిళల ఆటపాటలతో మార్మోగిన వెంకట సాయి నగర్ కాలనీ**



**ఉప్పల్,అక్టోబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలను వెంకట సాయి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వెంకట సాయి నగర్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని వివిధ కాలనీల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు, మహిళల సంప్రదాయ ఆటపాటలు, బతుకమ్మ పాటలతో వేడుకల ప్రాంగణం సందడిగా మారింది.ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, కోలాటాలు, ఆటపాటలతో సంబ రాలు జరుపుకున్నారు. వివిధ కాలనీలకు చెందిన మహిళలు ఒకచోట చేరి పండుగను జరుపుకోవడంతో ఆ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది.

వెంకట సాయి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఇటువంటి వేడుకలు మహిళల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు, మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరా లకు అంది ంచేందుకు దోహ దపడతాయని తెలిపా రు. వివిధ కాలనీల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం సంతోషంగా ఉందని, ప్రజల మధ్య స్నేహభావం, సామాజిక సమైక్యతను పెంపొందించే కార్యక్ర మాలకు తమ అసోసియేషన్ ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. వెంకట సాయి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యం లో నిర్వహించిన ఈ వేడుకల్లో స్థానిక మహిళలు, వివిధ కాలనీల ప్రతినిధులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. సంప్రదాయాల పరిరక్షణతో పాటు మహిళల ఐక్యతను చాటిచెప్పిన సద్దుల బతుకమ్మ సంబరాలు ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి.

# జవహర్‌నగర్‌లో మద్యం విక్రయాలపై నిఘా పెంచాలి

**● ప్రజారోగ్యం, యువత భవిష్యత్తుకు ప్రాధాన్యం ఇవ్వాలి: మొహమ్మద్ రషీద్**



**జవహర్‌నగర్, అక్టోబర్ 19 (పీసీడబ్ల్యూ న్యూస్):** జవహర్‌నగర్ పరిధిలో మద్యం విక్రయాలపై అధికారులు సమగ్ర పర్యవేక్షణ చేపట్టాలని సామాజిక ఉద్యమకారుడు మొహమ్మద్ రషీద్ కోరారు. మూడు వైన్‌షాపులు, నాలుగు బార్లతో పాటు సుమారు 200 బెల్ట్‌షాపులు ఉన్నాయనే సమాచారంపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని విజ్ఞప్తి చేశారు.అక్రమ మద్యం విక్రయాలను అరికట్టడంతో పాటు, అనుమతులు, పని వేళలు, వయోపరిమితి నిబంధనలు సక్రమంగా అమలవుతున్నాయో లేదో ఎక్సైజ్, పోలీసు, మున్సిపల్ అధికారులు తనిఖీ చేయాలని సూచించారు.మద్యం అలవాటు వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక పరిస్థితి దెబ్బతినే ప్రమాదం ఉందని, పిల్లల చదువు, ఆహారం, వైద్యంపై ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. మద్యం వ్యసనంతో బాధపడుతున్నవారికి కౌన్సెలింగ్, వైద్య చికిత్స, వ్యసన విముక్తి సేవలు అందించాలని కోరారు.అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ఫిర్యాదులపై సత్వర విచారణ జరపాలని, ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని రషీద్ విజ్ఞప్తి చేశారు. ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమం, యువత భవిష్యత్తు పరిరక్షణకు అధికారులు, ప్రజాసంఘాలు కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటానికి ఎమ్మెల్యే మద్దతివ్వాలి

**● బండారి లక్ష్మారెడ్డికి జేఏసీ వినతి**



**జవహర్‌నగర్, అక్టోబర్ 19 (పీసీడబ్ల్యూ న్యూస్):** జవహర్‌నగర్ రాంకీ డంపింగ్ యార్డును శాశ్వతంగా ఎత్తివేయాలనే పోరాటానికి మద్దతు ఇవ్వాలని జేఏసీ నాయకులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కోరారు. సోమవారం సైనిక్‌పురిలోని ఈసీఐఎల్ పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు జేఏసీ నాయకులు తెలిపారు.డంపింగ్ యార్డు కారణంగా గత 20 ఏళ్లుగా జవహర్‌నగర్‌తో పాటు కాప్రా, యాప్రాల్, దమ్మాయిగూడ, నాగారం, కీసర తదితర ప్రాంతాల ప్రజలు దుర్గంధం, పొగ, భూగర్భ జలాల కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభావిత ప్రాంతాల్లో ప్రజారోగ్యంపై సమగ్ర అధ్యయనం నిర్వహించాలని కోరారు.డంపింగ్ యార్డును శాస్త్రీయ పద్ధతుల్లో శాశ్వతంగా మూసివేయడంతో పాటు, పేరుకుపోయిన వ్యర్థాలను బయోమైనింగ్ ద్వారా తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభావిత ప్రాంతాలకు స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యను ముఖ్యమంత్రి, సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు జేఏసీ ప్రతినిధులు వెల్లడించారు. జేఏసీ చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్, కోశాధికారి పి. శివబాబు, సీపీఐ నాయకులు వి.ఎస్. బోసు, దామోదర్‌రెడ్డి, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# దుర్గామాత ఆలయాల్లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక పూజలు

**- అన్నపూర్ణ దేవి అవతారంలో అమ్మవారి దర్శనం**









**కరీంనగర్, అక్టోబర్ 19 (పీసీడబ్ల్యూ న్యూస్):** చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం నగరంలోని నగునూర్ దుర్గామాత ఆలయం, చైతన్యపురి మహాశక్తి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగునూర్‌లో అన్నపూర్ణ దేవి అవతారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకోగా, చైతన్యపురి మహాశక్తి ఆలయంలో దుర్గామాత, సరస్వతీదేవి, మహాలక్ష్మి అమ్మవార్లకు పూజలు చేశారు.అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌తో కలిసి ఆలయంలో నిర్వహిస్తున్న చండీ హోమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ చొప్పదండి నియోజకవర్గ ప్రజలతో పాటు జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, వారి కోరికలు నెరవేరాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. విజయదశమి సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి ఒక్కరూ చేపట్టే పనుల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సహకార సంఘాల చైర్మన్లు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, కోల రమేష్, కాంగ్రెస్ నాయకులు పులి ఆంజనేయులు గౌడ్, వరాల నర్సింగం, ముత్యం శంకర్, జవ్వాజి హరీష్, అన్నమనేని నరసింహారావు, వంశీ గౌడ్, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

PCW తెలుగు దినపత్రిక
మంగళవారం 20 అక్టోబర్ 2026

# రాంపూర్ ఆలయ దసరా ఉత్సవ కమిటీ ఏర్పాటు

### - చైర్మన్‌గా పడిశెట్టి భూమయ్య ప్రమాణ స్వీకారం



**కరీంనగర్, అక్టోబర్ 19 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణంలోని రాంపూర్ శ్రీ గిద్దె పెరుమాండ్ల స్వామి ఆలయ దసరా ఉత్సవాల నిర్వహణ కోసం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా కాంగ్రెస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ పడిశెట్టి భూమయ్యతో పాటు 16 మంది సభ్యులు ఆలయ ఈవో మారుతి, ప్రధాన పూజారి రామక శంకర్ శర్మ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ప్రతి ఏడాది దసరా సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, రామ్‌లీలా కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలను సమర్థంగా నిర్వహించేందుకు నూతన కమిటీని నియమించారు. అనంతరం కమిటీ సభ్యులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కరీంనగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రవీంద్ర గౌడ్, 39వ డివిజన్ నాయకుడు వేముల శ్రీనివాస్, ఆలయ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# మహాశక్తి ఆలయంలో చండీ హోమం

### - పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్







**కరీంనగర్, అక్టోబర్ 19 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్‌లోని శ్రీ మహాశక్తి దేవాలయంలో నిర్వహించిన శ్రీ రుద్ర సహిత చండీ హోమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించిన హోమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు తదితరులు పాల్గొన్నారు.

# అశోక్ నగర్‌లో ఘనంగా శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు



**కరీంనగర్, అక్టోబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ అశోక్ నగర్ లో శ్రీదేవి నవరాత్రి వేడుకలు అత్యంత అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఈ వేడుకల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి నిర్వహించిన పల్లకి సేవ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తుల కోలాహలాలు, మంగళవాయిద్యాల నడుమ సాగిన ఈ సేవలో భక్తులు భక్తిభావంతో పాల్గొన్నారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారు సర్వాభూషణ భూషితయై భక్తులకు దివ్యదర్శనం ఇచ్చారు. ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ గొట్టిముక్కుల ఉమా వెంకటరమణ దంపతులు కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలందరూ ఆ శ్రీదేవి కృపతో సుఖసంతోత్సవాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తుల సహకారంతో ఈ వేడుకలు కన్నులపండువగా కొనసాగుతున్నాయి.



# కాచిగూడలో ఘనంగా దేవీ శరన్నవరాత్రి వేడుకలు

### - జై అంబే భవానీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు

**హైదరాబాద్ అక్టోబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** కాచిగూడలోని కుత్బీగూడ ప్రాంతంలో జై అంబే భవానీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి మాజీ మంత్రి సి. కృష్ణ యాదవ్, భువనగిరి డిప్యూటీ కలెక్టర్ సిద్ధాల కృతిక ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ



సందర్భంగా వి.ఎన్. కుమారస్వామి, టిల్లు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. కాచిగూడ ప్రాంతంలో జై అంబే భవానీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక, సాంస్కృతిక సేవా కార్యక్రమాలను ముఖ్య అతిథులు అభినందించారు. అనంతరం ముఖ్య అతిథులను అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో స్థానిక ప్రజలు, భక్తులు, యూత్ అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# గోల్నాక మైసమ్మ ఆలయంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

### శ్రీ మహంకాళి దేవిగా అమ్మవారి దర్శనం

**హైదరాబాద్ అక్టోబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** గోల్నాక జైస్వాల్ గార్డెన్స్ లో వేంచేసియున్న శ్రీ శ్రీ శ్రీ మైసమ్మ దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజైన సోమవారం రోజున అమ్మవారు శ్రీ మహంకాళి దేవి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ ఉదయం నుండి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు, హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా సోమవారం నిర్వహించిన శ్రీ మహంకాళి దేవి చండీ హోమం పూర్ణాహుతితో వైభవంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి అంబర్‌పేట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ కాలేరు వెంకటేష్ గారు ముఖ్య అతిథిగా హాజరై, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు చెరుకు యాదవరెడ్డి, ప్రధాన కార్యదర్శి సి. హెచ్. ఇంద్రసేన్ యాదవ్, చైర్మన్ ఎన్.



రమేష్ గౌడ్, ఉపాధ్యక్షులు కె. దిలీప్ గౌడ్, కోశాధికారి పి. వెంకటేష్ గౌడ్, చీఫ్ సలహాదారులు జి. ప్రసన్నాంజనేయులు, జి. సురేందర్, ఎ. రామగౌడ్, బి. మధుసూదన్ చారి, పి. శ్రీహరి చారి పాల్గొన్నారు. అలాగే కమిటీ సభ్యులు పి. రామస్వామి, కె. ఈశ్వరయ్య, కె. అశోక్ కుమార్, టి. కృష్ణవేణిలతో పాటు కాలనీవాసులు లక్ష్మయ్య గౌడ్, ఎ. సత్యనారాయణ, ఎన్. స్వామి గౌడ్, అంజయ్య గౌడ్, గోవర్ధన్ రెడ్డి, కె. సత్యనారాయణ, రాజమల్లు, విజయ్ బాబు, శ్రీనివాస్ గుప్తా, కె. శ్రీధర్, రాకేష్, నరేష్, రాంచందర్ రావు, సంతోష్ గుప్తా తదితరులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



# గుజరాత్‌లో తెలంగాణ బతుకమ్మ సంబరాలు..

### సూరత్‌లో మహిళల కోలాహలం!

### సూరత్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**సూరత్, గుజరాత్ ఆగస్టు 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ నుంచి ఉపాధి కోసం గుజరాత్‌లోని సూరత్‌కు వలస వెళ్లిన తెలంగాణ ప్రజలు తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ సద్దుల బతుకమ్మ పండుగను ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. సూరత్‌లోని బాలాజీ నగర్ ప్రాంతంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మలను అందంగా అలంకరించి, పాటలు పాడుతూ సంప్రదాయబద్ధంగా సంబరాలు జరుపుకున్నారు. బాలాజీ నగర్‌అసోసియేషన్, బాలాజీ నగర్ సిద్ధి వినాయక మందిర కమిటీ, బాలాజీ నగర్ పద్మశాలీ సమాజం, కల్పన ప్రియాంక టౌన్, కైలాస్ నగర్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, సాంస్కృతిక ఐక్యతకు ఈ వేడుకలు ప్రతీకగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ వలస ప్రజల జేఏసీ ప్రతినిధి



గొడితాల లక్ష్మీపతి, సూరత్ పద్మశాలీ జనరల్ సమాజం అధ్యక్షుడు కోధునూరి శ్రీనివాస్, కార్యదర్శి తుమ్మ రమేష్‌తో పాటు 25వ వార్డుకు చెందిన కార్పొరేటర్లు జయేష్ చందోడికర్, ఎనగందుల కవిత, సంజయ్ భాయ్, సుష్మా పాటిల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే అంబటి సత్యంరావు, రుద్ర మనోహర్, మోహనరావు, రుద్ర రవికుమార్, దూడం శివ గణేష్, ఆడెపు వెంకన్న, చెన్న రమేష్, కొంగ భిక్షపతి, ఎనగందుల కర్ణాకర్, రణబీర్, దాసరి వీరన్న, కూరపాటి ఉపేందర్, సందుపట్ల శేషాద్రి, మూడ మోహన్, అంబటి పద్మ, వెంకటమ్మ, నిర్మల, సామల ఝాన్సీ, తుమ్మ పుష్పమ్మ, చిలుకూరి యశోద, దాసరి



సూరమ్మ, శ్రీరామ్ గీత, రుద్ర సరస్వతి పాల్గొన్నారు.



# చిలుకోయలపాడులో నూతన ఆటో డ్రైవర్ల యూనియన్ ఏర్పాటు



### అధ్యక్షుడిగా జర్పుల శ్రీను ఏకగ్రీవ ఎన్నిక

**సీరోల్, అక్టోబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆటో డ్రైవర్ల ఐక్యత, సంక్షేమం, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చిలుకోయలపాడు గ్రామంలో నూతన ఆటో డ్రైవర్ల యూనియన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడిగా జర్పుల శ్రీనును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆటో డ్రైవర్లందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి, వారి సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలనే ఉద్దేశంతో ఈ యూనియన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డ్రైవర్ల మధ్య ఐకమత్యాన్ని పెంపొందిస్తూ, వృత్తిపరంగా ఎదురయ్యే ఇబ్బందులను పరస్పర సహకారంతో పరిష్కరించుకునేందుకు యూనియన్ కృషి చేయనుంది. పూర్తిస్థాయి నూతన కమిటీ ఉపాధ్యక్షులుగా నాగటి ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా గిరబోయిన సుధాకర్, కోశాధికారిగా గూగులోతు ప్రభాకర్, గౌరవ అధ్యక్షులుగా జోగి వీరన్న, సలహాదారునిగా బొజ్జ వీరేందర్ లను మరియు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఎన్నికైన జర్పుల శ్రీను మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన యూనియన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆటో డ్రైవర్ల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి అందరినీ కలుపుకొని పనిచేస్తానని పేర్కొన్నారు. నూతన యూనియన్ ఏర్పాటు పట్ల గ్రామ సర్పంచ్ ఊడుగుల వెంకన్న మరియు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలిన రవికుమార్లు పాల్గొని వారిని అభినందించారు. స్థానిక ఆటో డ్రైవర్లు హర్షం వ్యక్తం చేశారు. యూనియన్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.



# చిగురుమామిడిలో ఘనంగా ఆర్ఎస్ఎస్ విజయదశమి ఉత్సవం





**కరీంనగర్, అక్టోబర్ 19(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ కు చెందిన చిగురుమామిడి మండల కేంద్రంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ విజయదశమి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయంసేవకులు సంప్రదాయ గణవేష్ ధరించి శస్త్ర పూజ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఎస్ఎస్ కరీంనగర్ ప్రచార ప్రముఖ్ గీకూరి శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి, శమీ పూజ నిర్వహించిన అనంతరం స్వయంసేవకులను ఉద్దేశించి ప్రసంగించారు.విజయదశమి పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, సమాజంలో ధర్మాన్ని, సాంస్కృతిక విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆర్ఎస్ఎస్ గత 100 సంవత్సరాలుగా స్వచ్ఛందంగా దేశ సేవలో నిమగ్నమై ఉందని, వ్యక్తి నిర్మాణం ద్వారానే బలమైన, సమర్థవంతమైన దేశ నిర్మాణం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుత సమాజంలో యువత దేశభక్తిని పెంపొందించుకుని, సమాజ సేవా కార్యక్రమాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. కుల, మత భేదాలు లేకుండా సమాజమంతా ఏకతా భావంతో ముందుకు సాగినప్పుడే సుదృఢ భారత్ సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి స్వయంసేవకుడు పర్యావరణ పరిరక్షణ, కుటుంబ ప్రబోధన్, స్వదేశీ వస్తువుల వినియోగం వంటి పంచ పరివర్తన సిద్ధాంతాలను తమ జీవితాల్లో ఆచరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ ఖండ కార్యవాహ ఆవుల కుమార్ , మొగిలి సంపత్ , మురళి పెద్ద సంఖ్యలో స్వయంసేవకులు, సంఘ పరివార్ నాయకులు, ప్రముఖులుగ్రామస్థులు పాల్గొన్నారు.

# నూతన ఎస్ఐకి కాంగ్రెస్ నాయకుల అభినందనలు... శాలువా కప్పి సన్మానం



**కల్లూరు, అక్టోబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :**కల్లూరు మండల నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన జె. నాగరాజు యాదవ్ ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెద్దబోయన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగరాజుకు శాలువా కప్పి సత్కరించారు. నూతన బాధ్యతల్లో ఆయన ప్రజలకు మెరుగైన సేవలందించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. పోలీసు శాఖ ప్రజలకు మరింత చేరువ కావాలని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెద్దబోయిన శ్రీనివాసరావు, ఏనుగు సత్యంబాబు, రాజపోయన శ్రీనివాసరావు, తోట సుబ్బారావు తదితరులు పాల్గొని ఎస్ఐకు శుభాకాంక్షలు తెలిపారు.

# పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**ప్రభుత్వ ఆసుపత్రిలో మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ ఆకస్మిక తనిఖీ**

**ఫ్రీజర్ బాక్స్, ఈసీజీ, ఎకో పరికరాలు త్వరగా అందించాలి**



**కల్లూరు, అక్టోబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :**కల్లూరు పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) ప్రభుత్వ ఆసుపత్రిని మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పసుమర్తి చందర్ రావుతో కలిసి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంజిత్, వైద్యులు, సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే పేద రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. దూర ప్రాంతాల నుంచి ఎన్నో వ్యయప్రయాసలకోర్చి ఆసుపత్రికి వచ్చే రోగులను ఆప్యాయంగా పలకరిస్తూ, వారికి ధైర్యం కల్పించేలా వైద్య సేవలు అందించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెరిగేలా సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని పేర్కొన్నారు.ఆసుపత్రిలో అవసరమైన మౌలిక సదుపాయాలపై సూపరింటెండెంట్ డాక్టర్ రంజిత్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఫ్రీజర్ బాక్స్, ఈసీజీ, ఎకో పరికరాలను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. దీనిపై స్పందించిన మోహన్ నాయక్, ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పనకు, రోగులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహకారం అందించేందుకు మున్సిపాలిటీ తరఫున కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ సేలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు గుండ్ల పుల్లారావు, జిల్లెల్ల స్వాతి భాస్కర్ రెడ్డి, కుంచాల గురవయ్య, ధరావత్ రవికుమార్, బొల్లెం ఉపేందర్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలందరి జీవితాల్లో విజయదశమి వెలుగులు నింపాలి

**- 18వ వార్డు కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ దంపతులు**






**కల్లూరు, అక్టోబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :**విజయానికి ప్రతీక అయిన విజయదశమి పండుగను మండల ప్రజలందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని కల్లూరు పురపాలక సంఘం 18వ వార్డు కౌన్సిలర్, బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు పెడకంటి రామకృష్ణ ఆకాంక్షించారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని మండల, పట్టణ ప్రజలకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దసరా పండుగ ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరారు. ప్రజల మధ్య సోదరభావం, ఐకమత్యం మరింత బలపడాలని ఆకాంక్షించారు. కల్లూరు మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి ప్రగతిపథంలో ముందుకు సాగాలని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ కుటుంబ సభ్యులు, ఆత్మీయులతో కలిసి విజయదశమి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల సంక్షేమం, వార్డు అభివృద్ధి ఆకాంక్షలతో పండుగలు ప్రజల్లో ఐక్యతను పెంపొందించేలా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

# చెడుపై ఎప్పటికైనా విజయం 'మంచి'కే... విజయ దశమి పర్వదినమే నిదర్శనం

**చెడు చేసే వాళ్లు ప్రవర్తన మార్చుకుని పరులకు సేవ చేస్తేనే అమ్మవారి కరుణాకటాక్షాలుంటాయి**

**గతం కంటే ఎక్కువగా ఈసారి దేవీ నవరాత్రి ఉత్సవాలు జరిగాయి**

**విదేశాల్లోనూ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించి భారతీయ సంస్కృతిని పరిరక్షిస్తున్నారు**

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**

**హిందు బంధువులందరికీ దసరా శుభాకాంక్షలు చెప్పిన కేంద్ర మంత్రి**





**కరీంనగర్, అక్టోబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్):** చెడు చేసే వారికి ఎన్నటికీ విజయం వరించదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఎన్నటికైనా చెడుపై విజయం సాధించేది 'మంచి' మాత్రమేనని పునరుద్ఘాటించారు. పొరపాటున చెడు చేసే వారు ఇకనైనా ప్రవర్తనను మార్చుకుని ఇతరులకు సేవ చేయాలని, అలాంటి వారిపట్ల మాత్రమే అమ్మవారి కరుణా కటాక్షం ఉంటుందని చెప్పారు. మహిషాశుర మర్ధిని చరిత్ర కూడా అదే చెబుతుందని తెలిపారు. దేవీ నవరాత్రి ఉత్సవాల చివరి రోజైన సోమవారం కరీంనగర్ మహాశక్తి ఆలయంలో అమ్మవారు మహిషాశుర వర్ధిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో 'చండీ యాగం' పేరిట నిర్వహించిన హోమంలో పాల్గొన్నారు. అనంతరం భవానీ దీక్షను విరమించారు. సాయంత్రం 7.30 గంటలకు మహాశక్తి ఆలయంలో నిర్వహించిన రావణ దహనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే....హిందు బంధువులందరికీ విజయ దశమి శుభాకాంక్షలు. దేశవ్యాప్తంగా, తెలంగాణ, తెలుగు రాష్ట్రాల్లో గల్లీగల్లీలో దేవీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకున్నాం. చిన్ని పిల్లలు సైతం అమ్మవారికి పూజలు చేశారు. కరీంనగర్ మహాశక్తి ఆలయంలో దేవీ నవరాత్ర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. వేలాది మంది భక్తులు దీక్షలు ఇక్కడే చేపట్టారు. అమ్మవారిని మొక్కుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయనే నమ్మకం భక్తుల్లో ఏర్పడింది. దేశంలోనే కాదు, విదేశాల్లోని తెలుగు కుటుంబాలు సైతం పెద్ద ఎత్తున దేవీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు.చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయ దశమి పర్వదినంగా జరుపుకుంటున్నాం. పొరపాటున చెడు చేస్తే ప్రవర్తన మార్చుకుని ఇతరులకు సేవ చేస్తే అమ్మవారి కరుణా కటాక్షం ఉంటుంది. చెడు ఎప్పుడు విజయం సాధించదు. అధర్మానికి చోటు లేదు. మహిషాశుర మర్ధిని చరిత్ర కూడా అదే చెబుతుంది.

# పరకాల శివాలయాన్ని దర్శించుకున్న నాగూర్ల వెంకన్న





**పరకాల, అక్టోబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణంలోని పురాతన శివాలయాన్ని తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకన్న సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, రైతులు పాడిపంటలతో సంతోషంగా ఉండాలని, పరకాల ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పరకాల మండల ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గందె వెంకటేశ్వర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతు సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# సరస్వతి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ప్రత్యేక పూజలు





**సత్తుపల్లి, అక్టోబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :**పట్టణంలోని సరస్వతి ఆలయంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య కు శాలువా కప్పి ఘనశీగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేకమైన పూజలు నిర్వహించి సండ్ర ను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, శీలపురెడ్డి హరికృష్ణ రెడ్డి, మోరంపూడి ప్రభాకర్, భీమిరెడ్డి గోపాల్ రెడ్డి, పర్వతనేని వేణు, గుర్రం సురేష్, నాయుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు

## - గ్రామ సర్పంచ్ ఊడుగుల వెంకన్న



సీరోల్, అక్టోబర్ 19 పీసీడబ్ల్యూ న్యూస్: తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా చిలుకోయలపాడు గ్రామ ప్రజలకు సర్పంచ్ ఊడుగుల వెంకన్న విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయదశమి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో ఉంటూ గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందాలు నింపాలని, ప్రజలందరికీ విజయం కలగాలని ఆకాంక్షించారు.

# ప్రజల సమస్యల స్వీకరణ పరిష్కారానికి చర్యలు

## - కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్




కల్లూరు, అక్టోబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులను స్వీకరించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ, నిర్ణీత సమయంలో పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.

# భూ రీసర్వే పారదర్శకంగా నిర్వహించాలి

## - రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి: సబ్ కలెక్టర్



పెనుబల్లి, అక్టోబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :పెనుబల్లి మండలం తుమ్మలపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ పునఃసర్వే (రీసర్వే) పనులను సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రీసర్వే నిర్వహణ తీరును, భూముల హద్దుల నిర్ధారణ ప్రక్రియను పరిశీలించి, రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలు, భూ సంబంధిత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రీసర్వే ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, భూముల సర్వేను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. భూ హద్దులు, ఇతర భూ సంబంధిత సమస్యలపై రైతులు తెలియజేసే ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రీసర్వే ద్వారా భూముల వివరాల్లో స్పష్టత తీసుకురావడంతోపాటు రైతులకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. సర్వే ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ, రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు.

# తెలంగాణ ప్రజలకు విజయదశమి దసరా శుభాకాంక్షలు తెలిపిన మహమ్మద్ అబ్దుల్ బారి

## - చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి: మహమ్మద్ అబ్దుల్ బారి



కరీంనగర్, అక్టోబర్ 19 (పీసీడబ్ల్యూ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా కరీంనగర్ నియోజకవర్గ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహమ్మద్ అబ్దుల్ బారి విజయదశమి, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయదశమి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను జరుపుకుంటామని ఆయన పేర్కొన్నారు. ప్రజలు తలపెట్టిన ప్రతి కార్యం విజయవంతం కావాలని, ప్రతి ఇంట్లో ఆనందం, ఐశ్వర్యం, శాంతి వెల్లివిరియాలని కోరుకున్నారు. ఈ పర్వదినం ప్రజలందరి జీవితాల్లో కొత్త ఆశలు, సానుకూలతను నింపాలని ఆకాంక్షిస్తూ, మరోసారి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, కరీంనగర్ నియోజకవర్గ ప్రజలకు విజయదశమి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

# వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

## తెలిపిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

### చెడు మీద మంచి విజయం.. ధర్మానికి ప్రతీక విజయదశమి

### కులమతాలకు అతీతంగా ఐకమత్యంతో పండుగ జరుపుకోవాలి.. ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలి



వరంగల్ అక్టోబర్ 19 పీసీడబ్ల్యూ న్యూస్: విజయదశమి (దసరా) పర్వదినాన్ని పురస్కరించుకుని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలందరికీ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పండుగ ప్రజల్లో నూతన ఆశలు, సానుకూల ఆలోచనలు, విజయస్ఫూర్తిని నింపుతుందని పేర్కొన్నారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖ శాంతులు, సిరిసంపదలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచే దసరా పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, జీవితంలో ఎదురయ్యే ప్రతి సవాలును ధైర్యంగా ఎదుర్కొని విజయాలు సాధించాలని కోరారు. చెడు ఎంత బలంగా కనిపించినా.. చివరికి గెలిచేది మంచితనమే అని విజయదశమి చాటిచెబుతుందని ఎంపీ డా. కడియం కావ్య పేర్కొన్నారు. పాలపిట్ట దర్శనం శుభసూచకంగా భావించే ఈ పర్వదినం ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ప్రతి కుటుంబంలో సంతోషం, శ్రేయస్సు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. కులమతాలకు అతీతంగా సోదరభావం, పరస్పర గౌరవం, ఐకమత్యంతో పండుగను జరుపుకోవాలని ప్రజలకు పిలుపుని చ్చారు. రైతులు, కార్మికులు, యువత, మహిళలు సహా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు విజయదశమి శుభాలను అందించాలని, ప్రతి ఒక్కరి ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలని ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగమించాలని, ప్రజల ఆశయాలు నెరవేరాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులు, ప్రజల దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని, ఈ విజయదశమి ప్రతి ఒక్కరి జీవితంలో విజయాలకు, శుభపరిణామాలకు నాంది కావాలని ఈ సందర్భంగా మరోసారి ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

# సాంస్కృతిక ఆచారాలపై సమీక్ష జరగాలి

### రావణాసుర వధ కార్యక్రమాలను రద్దు చేయాలి

### మూలవాసీ బహుజనుల అస్తిత్వం, ఆత్మగౌరవానికి గుర్తింపు ఇవ్వాలి: గడ్డం శరత్

హనుమకొండ,అక్టోబర్ 19 (పిసిడబ్ల్యూ న్యూస్) : సామాజిక సమానత్వం, ప్రజాస్వామిక విలువలు, మానవ గౌరవానికి ప్రాధాన్యమిస్తూ రావణాసుర వధ కార్యక్రమాల నిర్వహణను రద్దు చేయాలని ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ, దళిత బహుజన శ్రామిక విముక్తి సంఘాల వరంగల్ జిల్లా కమిటీలు డిమాండ్ చేశాయి. మూలవాసీ బహుజనుల చరిత్ర, సంస్కృతి, అస్తిత్వం, ఆత్మగౌరవాన్ని గౌరవించేలా సమాజంలో చైతన్యం పెంపొందించాలని కోరాయి. ఈ మేరకు ఆయా సంఘాల వరంగల్ జిల్లా కార్యదర్శి గడ్డం శరత్ అక్టోబర్ 19న విడుదల చేసిన ప్రకటనలో సాంస్కృతిక సంప్రదాయాలపై పునరాలోచన చేయాల్సిన అవసరాన్ని వివరించారు. **భిన్న సాంస్కృతిక దృక్కోణాలకు గౌరవం ఇవ్వాలి**భారతీయ సమాజంలో కుల, మత, సామాజిక అసమానతలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, గౌరవం కల్పించే దిశగా ప్రజాస్వామిక చైతన్యాన్ని విస్తృతం చేయాలని ప్రకటనలో పేర్కొన్నారు. సంప్రదాయాలను యథాతథంగా కొనసాగించడం కంటే వాటి సామాజిక ప్రభావాలను విశ్లేషించి, మానవీయ విలువలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. రావణుడిని కేవలం ప్రతికూల పాత్రగా చిత్రీకరించే సంప్రదాయ కథనాలను వివిధ చారిత్రక, సామాజిక కోణాల్లో పరిశీలించాలని అభిప్రాయపడ్డారు. భిన్న సామాజిక వర్గాలకు రావణుడి పట్ల ఉన్న విశ్వాసాలు, సాంస్కృతిక దృక్కోణాలను గౌరవిస్తూ చరిత్రను సమగ్రంగా అధ్యయనం చేయాలని కోరారు. **వివక్షకు తావులేని సమాజం కోసం కృషి చేయాలి**కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా ప్రజలందరికీ సమాన హక్కులు, అవకాశాలు కల్పించడమే సామాజిక న్యాయం లక్ష్యమని కమిటీలు పేర్కొన్నాయి. సాంస్కృతిక, మతపరమైన ఆచారాలు ఏ సామాజిక వర్గం ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే పరిస్థితులకు దారితీయకూడదని అభిప్రాయపడ్డాయి. అసమానతల నిర్మూలనకు ప్రజాస్వామిక చర్చలు, సామాజిక సంస్కరణలు, ప్రజా చైతన్య కార్యక్రమాలను విస్తృతం చేయాలని కోరాయి. తెలంగాణలో సామాజిక న్యాయం, ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కోసం జరుగుతున్న ఉద్యమాలను బలోపేతం చేయాలని, మూలవాసీ బహుజనుల సామాజిక, సాంస్కృతిక, రాజకీయ హక్కుల పరిరక్షణకు ప్రజలు సంఘటితంగా కృషి చేయాలని పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో రావణాసుర వధ కార్యక్రమాల నిర్వహణపై పునరాలోచించి, సామాజిక సమానత్వం, పరస్పర గౌరవం, మానవీయ విలువలకు ప్రాధాన్యమివ్వాలని గడ్డం శరత్ ప్రకటనలో డిమాండ్ చేశారు.



# భూదాన్ పోచంపల్లిలో ఓల్డ్ సిటీ దుర్గామాతకు లక్ష గాజుల సమర్పణ





### భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు.. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా కార్యక్రమం



చేరాల అక్టోబర్ 19 పీసీడబ్ల్యూ న్యూస్: భూదాన్ పోచంపల్లి పట్టణంలోని ఓల్డ్ సిటీ దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి లక్ష గాజులను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, పట్టణం సుఖసంతోషాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిం చారు. అమ్మవారికి లక్ష గాజుల సమర్పణ కార్యక్ర మాన్ని అంకం యాదగిరి, అంకం మురళి, అంకం దయానందం తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తి భావంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొని అమ్మవారికి గాజులను సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమ ంలో అంకం సాయి, మిర్యాల భాస్కర్, వంగూరి భానుచందర్, చేపూరి వినయ్ రాజ్, కట్కూరి లింగస్వామి గౌడ్, చెరుకు వెంకట్, మైల మధు, చేరాల కిరణ్, శెట్టి మనీష్, చెక్క శ్రీకాంత్, చేరాల నరేష్, బోడ సత్యనారాయణ, జెగ్రీగల ఉపేందర్, వంగూరి బాలకృష్ణ, గడ్డం సుమన్, నక్క శివకుమార్, బాత్క నరేష్, గునిగంటి శంకర్, మెరుగు కుమార్, ధనముని శివ, చెక్క స్వామి, డబ్బీకార్ అభిషేక్‌లు పాల్గొన్నారు. ఓల్డ్ సిటీ దుర్గామాతకు లక్ష గాజుల సమర్పణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొ నగా, అమ్మవారి సేవలో పాల్గొన్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.



## టీమిండియా చీఫ్ సెలెక్టర్‌గా ప్రజ్ఞాన్ ఓజా!

బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. భారత పురుషుల క్రికెట్ జట్టు సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా మాజీ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటివరకు చీఫ్ సెలెక్టర్‌గా ఉన్న అజిత్ అగార్కర్ స్థానంలో ఓజా వ్యవహరించనున్నారు. మరోవైపు, మాజీ స్పిన్నర్ రమేష్ పవార్‌కు కూడా సెలక్షన్ కమిటీలో చోటు దక్కింది. మరి ఓజా నేతృత్వంలోని కమిటీ టీమిండియా ఎంపికలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో చూడాలి.

# పారా ఆసియా క్రీడల్లో భారత్ విజయకేతనం

**రెండు స్వర్ణాలు.. ఒక రజతం కైవసం**

**షూటింగ్‌లో మోనా అగర్వాల్‌కు పసిడి..**

**అవనీ లేఖరాకు వెండి పతకం**

**లాంగ్‌జంప్‌లో నిషాద్ కుమార్ అద్భుత ప్రదర్శన**

**ఐచీ, అక్టోబర్ 19:** పారా ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. అంతర్జాతీయ క్రీడా వేదికపై అద్భుత ప్రతిభను ప్రదర్శిస్తూ దేశానికి కీర్తిప్రతిష్ఠలు తీసుకొస్తున్నారు. సోమవారం జరిగిన పోటీల్లో భారత క్రీడాకారులు రెండు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకాన్ని సాధించి విజయభేరి మోగించారు. మహిళల షూటింగ్‌లో మోనా అగర్వాల్ స్వర్ణ పతకాన్ని గెలుచుకోగా, అవనీ లేఖరా రజత పతకంతో మెరిశారు. మరోవైపు పురుషుల లాంగ్‌జంప్‌లో నిషాద్ కుమార్ అద్భుత ప్రదర్శనతో బంగారు పతకాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు.

**షూటింగ్‌లో భారత క్రీడాకారిణుల ఆధిపత్యం**

మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్–1 విభాగంలో భారత షూటర్లు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఫైనల్ పోటీలో మోనా అగర్వాల్ 250 పాయింట్లు సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. మరో భారత క్రీడాకారిణి అవనీ లేఖరా 249.6 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించారు. ఒకే విభాగంలో భారత క్రీడాకారిణులు తొలి రెండు స్థానాలను దక్కించుకోవడం విశేషంగా నిలిచింది. దక్షిణ కొరియాకు చెందిన లీ యున్రీ కాంస్య పతకాన్ని సాధించారు. మోనా అగర్వాల్ తన అసాధారణ ప్రతిభతో గత పారా ఆసియా క్రీడల రికార్డును అధిగమించడం విశేషం. గతంలో



చైనాలోని హాంగ్‌జౌలో జరిగిన పారా ఆసియా క్రీడల్లో అవనీ లేఖరా నమోదు చేసిన స్కోరును అధిగమిస్తూ మోనా అగ్రస్థానంలో నిలిచారు. ఈ విజయంతో భారత షూటింగ్ జట్టు అంతర్జాతీయ స్థాయిలో తన సామర్థ్యాన్ని మరోసారి చాటుకుంది.

**లాంగ్‌జంప్‌లో నిషాద్ కుమార్‌కు పసిడి**

అథ్లెటిక్స్ విభాగంలోనూ భారత్‌కు మరో స్వర్ణ పతకం లభించింది. పురుషుల టీ47 లాంగ్‌జంప్ పోటీలో రెండుసార్లు పారాలింపిక్స్ రజత పతక విజేత నిషాద్ కుమార్ అద్భుత ప్రదర్శనతో బంగారు పతకాన్ని సాధించాడు. ఈ విభాగంలో తొలిసారిగా పోటీపడుతున్నప్పటికీ ఏమాత్రం ఒత్తిడికి లోనుకాకుండా తన సత్తాను చాటుకున్నాడు. తన అత్యుత్తమ ప్రదర్శనగా 7.11 మీటర్ల దూరం దూకి ప్రత్యర్థులను వెనక్కి నెట్టి అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో తన ప్రతిభను నిరూపించుకున్న నిషాద్ కుమార్, కొత్త



విభాగంలోనూ పతకాన్ని సాధించడం భారత క్రీడారంగానికి గర్వకారణంగా నిలిచింది. విభిన్న క్రీడా విభాగాల్లో పోటీపడుతూ పతకాలు సాధిస్తున్న భారత పారా క్రీడాకారులు తమ పట్టుదల, కఠోర శ్రమతో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

**భారత క్రీడాకారులకు అభినందనలు**

వైకల్యాలను అధిగమించి ప్రపంచస్థాయి పోటీల్లో పాల్గొంటూ అత్యుత్తమ ప్రదర్శనలు చేయడం పారా క్రీడాకారుల అంకితభావానికి నిదర్శనం. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ లక్ష్య సాధన కోసం వారు చేస్తున్న కృషి ఎంతోమందికి స్ఫూర్తినిస్తోంది. షూటింగ్, అథ్లెటిక్స్ విభాగాల్లో భారత క్రీడాకారులు సాధించిన విజయాలు దేశ క్రీడాభిమానుల్లో ఆనందాన్ని నింపాయి. రానున్న పోటీల్లోనూ భారత క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించి దేశ కీర్తిని ఇనుమడింపజేయాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

## జింబాబ్వేపై భారత మహిళల ఘనవిజయం



**• 2-0తో సిరీస్ కైవసం**

**రాయ్‌పూర్:** జింబాబ్వేతో జరిగిన రెండో టీ20లో భారత మహిళల జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2–0తో సొంతం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 102 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో షఫాలీ వర్మ 25 బంతుల్లో 55 పరుగులతో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడగా, కెప్టెన్ స్మృతి మంధాన 25 బంతుల్లో 47 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. దీంతో భారత్ కేవలం 8.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. చివరి టీ20లోనూ గెలిచి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని భారత జట్టు భావిస్తోంది.

# విమానంలోనూ నిరాడంబరత చాటిన రాహుల్ ద్రవిడ్

**- అభిమానిని ఆప్యాయంగా పలకరించి ఆటోగ్రాఫ్.. సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన వీడియో**

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, మాజీ ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ తన నిరాడంబరతతో మరోసారి అభిమానుల మనసులు గెలుచుకున్నారు. క్రికెట్ మైదానంలో ప్రశాంతతకు, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన ఆయన.. మైదానం బయట కూడా అదే హుందాతనాన్ని ప్రదర్శించారు. సాధారణ ప్రయాణికుడిలా విమానంలో ప్రయాణిస్తూ ఓ అభిమాని అడిగిన ఆటోగ్రాఫ్‌ను చిరునవ్వుతో అందించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

**విమానంలో ఊహించని ఆనందం**

ముగ్గురు తోబుట్టువులు ఇండిగో విమానంలో ప్రయాణిస్తుండగా, అదే విమానంలో రాహుల్ ద్రవిడ్ ఉండటాన్ని గుర్తించారు. దీంతో వారు ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. వారిలో ఒకరు ధైర్యం చేసి ద్రవిడ్ వద్దకు వెళ్లి ఆటోగ్రాఫ్ కోరగా, ఆయన ఏమాత్రం అసహనం వ్యక్తం



చేయకుండా సంతకం చేసి ఇచ్చారు. ఈ అరుదైన సందర్భాన్ని మరో వ్యక్తి తన కెమెరాలో చిత్రీకరించాడు. విమాన ప్రయాణంలో జరిగిన ఈ చిన్న సంఘటన అభిమానులకు మధుర జ్ఞాపకంగా మిగిలింది.

**విమానాశ్రయ బస్సులోనూ అదే నిరాడంబరత**

విమాన ప్రయాణం ముగిసిన తర్వాత విమానాశ్రయంలోని బస్సులో కూడా ద్రవిడ్‌ను ఆ అభిమానులు మరోసారి చూశారు. ఆ సందర్భాన్ని సైతం వీడియోగా చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఈ వీడియోను చూసిన క్రికెట్ అభిమానులు ద్రవిడ్ సాదాసీదా ప్రవర్తనను ప్రశంసిస్తున్నారు. ప్రముఖ క్రికెటర్ అయినప్పటికీ అభిమానుల పట్ల ఆయన చూపిన ఆదరణ అందరినీ ఆకట్టుకుంటోంది.

**'ఇందిరానగర్ కా గూండా.. నిజ జీవితంలో చాలా మంచివారు'**

ఈ వీడియోకు అభిమానులు పెట్టిన వ్యాఖ్య మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో ఓ ప్రకటనలో ద్రవిడ్ కోపంగా నటిస్తూ చెప్పిన 'ఇందిరానగర్ కా గూండా' అనే సంభాషణ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రాచు ర్యం పొందింది. సాధారణంగా ప్రశాంతంగా కనిపించే ద్రవిడ్ ఆ ప్రకటనలో భిన్నమైన పాత్రలో కనిపిం చడంతో ఆ సంభాషణ అభిమానులకు గుర్తుండి పోయింది. తాజాగా విమానంలో ఆయన అభిమానితో ఆప్యాయంగా వ్యవహరించిన వీడియోకు అదే విషయా న్ని ప్రస్తావిస్తూ వ్యాఖ్యను జోడించారు. ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న తర్వాత పెద్ద సంఖ్యలో వీక్షణలు వచ్చాయి. ద్రవిడ్ ఆటోగ్రాఫ్ ఇచ్చిన తీరు, అభిమానులతో మాట్లాడిన విధానం నెటిజన్లను ఆకట్టు కున్నాయి. మైదానంలోనే కాకుండా సాధారణ జీవితంలోనూ తన వ్యక్తిత్వంతో అభిమానుల ప్రేమను పొం దుతున్న రాహుల్ ద్రవిడ్ మరోసారి వార్తల్లో నిలిచారు.

## భువీ రాకతో బుమ్రాకు విశ్రాంతి ఇవ్వాలి



**- మాజీ కోచ్ రవిశాస్త్రి కీలక సూచన**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 19**: భారత క్రికెట్ జట్టు పేస్ బౌలింగ్ విభాగంపై మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి కీలక వ్యాఖ్యలు చేశారు. సీనియర్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ జట్టులోకి తిరిగి రావడంతో జస్‌ప్రీత్ బుమ్రాపై పనిభారాన్ని తగ్గించాలని సూచించారు. వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని బుమ్రాను మూడు ఫార్మాట్లలోనూ నిరంతరం ఆడించకూడదని అభిప్రాయపడ్డారు.

**భువీ అనుభవం జట్టుకు బలం**

సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టులోకి తిరిగి వచ్చిన భువనేశ్వర్ కుమార్ అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని రవిశాస్త్రి పేర్కొన్నారు. ఐపీఎల్‌లో అతడు చూపిన ప్రదర్శన, బంతిని స్వింగ్ చేయగల సామర్థ్యం న్యూజిలాండ్ పరిస్థితులకు అనుకూలంగా ఉంటాయని తెలిపారు. పరిమిత ఓవర్ల క్రికెట్‌తో పాటు టెస్టుల్లోనూ అతడికి అవకాశాలు కల్పించాలని సూచించారు.

**బుమ్రా పనిభారంపై దృష్టి**

బుమ్రా గాయాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రవిశాస్త్రి అన్నారు. ముఖ్యంగా టెస్టు క్రికెట్‌కు ప్రాధాన్యమిస్తూ, వన్డేలు, టీ20ల్లో అవసరాన్ని బట్టి మాత్రమే ఆడించాలని సూచించారు. న్యూజిలాండ్‌తో జరగనున్న టెస్టు సిరీస్‌లో బుమ్రా సేవలు కీలకమని పేర్కొన్నారు.

**ప్రపంచకప్ సన్నాహకాలకు కీలకం**

న్యూజిలాండ్ పర్యటన భారత జట్టుకు ఎంతో ముఖ్యమైనదని రవిశాస్త్రి అభిప్రాయపడ్డారు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌తో పాటు 2027 వన్డే ప్రపంచకప్ సన్నాహకాలకు ఈ పర్యటన ఉపయోగపడుతుందని తెలిపారు. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా పిచ్‌ల పరిస్థితుల్లో కొన్ని పోలికలు ఉండే అవకాశం ఉందని, అందువల్ల ఈ పర్యటనలో ఆటగాళ్ల ప్రదర్శన భవిష్యత్ ప్రణాళికలకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

## ఘనంగా ముగిసిన గుర్రపు స్వారీ పోటీలు




**• రాష్ట్ర స్థాయి అశ్వక్రీడల్లో యువ క్రీడాకారుల ప్రతిభాపాటవాలు**

**హైదరాబాద్, అక్టోబర్ 19:** హైదరాబాద్‌లోని గండిపేట హైదరాబాద్ పోలో అండ్ రైడింగ్ క్లబ్ వేదికగా నిర్వహించిన రెండో తెలంగాణ రాష్ట్ర స్థాయి గుర్రపు స్వారీ పోటీలు ఘనంగా ముగిశాయి. అక్టోబర్ 16 నుంచి 18 వరకు మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో వివిధ వయో విభాగాలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. తెలంగాణ అశ్వక్రీడల సంఘం సహకారంతో నిర్వహించిన ఈ పోటీల్లో గుర్రపు స్వారీ, గుర్రాలతో అడ్డంకులను అధిగమించే పోటీలు సహా పలు విభాగాల్లో క్రీడాకారులు పోటీపడ్డారు.

**విభిన్న విభాగాల్లో పోటీలు**

పోటీల్లో భాగంగా డ్రెస్సాజ్, షో జంపింగ్ వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పిల్లలు, జూనియర్లు, యువ క్రీడాకారులు, ఓపెన్ విభాగాల్లో పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ముఖ్యంగా తక్కువ ఎత్తులోని అడ్డంకులను దాటే పోటీలను ప్రారంభస్థాయి క్రీడాకారులకు అందుబాటులో ఉంచడంతో కొత్తగా ఈ క్రీడలోకి అడుగుపెట్టిన వారికి తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం లభించింది.

**యువ అశ్వక్రీడాకారుల సత్తా**

పోటీల్లో భాగంగా నిర్వహించిన డ్రెస్సాజ్ విభాగంలో సిద్ధార్థ్ దత్తా, గౌతమ్ సంజయ్ సుజనాని తమ ప్రతిభతో ఆకట్టుకున్నారు. పిల్లల విభాగంలో సిద్ధార్థ్ దత్తా విజేతగా నిలవగా, జూనియర్ విభాగంలో గౌతమ్ సంజయ్ సుజనాని అగ్రస్థానాన్ని సాధించారు. షో జంపింగ్ విభాగంలోనూ పలువురు క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబరిచారు. అబ్దుల్ మానన్ ఓపెన్ విభాగంలో విజయం సాధించగా, ఇతర విభాగాల్లోనూ యువ క్రీడాకారులు పతకాలు, బహుమతులు దక్కించుకున్నారు.

**జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులు**

రాష్ట్ర స్థాయి పోటీలకు ముందు అక్టోబర్ 14 నుంచి 16 వరకు ఇదే వేదికపై నిర్వహించిన జాతీయ అర్హత పోటీల్లో 18 మంది క్రీడాకారులు జూనియర్ జాతీయ అశ్వక్రీడల పోటీలకు అర్హత సాధించారు. రెండు రోజుల పాటు జరిగిన ఆ పోటీల్లో మొత్తం 58 ప్రదర్శనలు నమోదయ్యాయి. డ్రెస్సాజ్ విభాగంలో అనెట్ సలోమీ కాస్టిలినో 71.61 శాతం స్కోరుతో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. తెలంగాణలో అశ్వక్రీడలను ప్రోత్సహించడం, యువ క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఇటువంటి పోటీలు నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్ర క్రీడాకారులు జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

# వారసుడి సినిమాలో సింహం ఓ మెరుపులా!



యంగ్ డైరెక్టర్ మల్లిడి వశిష్ట దర్శకత్వంలో నందమూరి వారసుడు మోక్షజ్ఞ టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్న సంగతి తెలిసిందే. ఎంతో మంది దర్శకుల పేర్లు పరిశీలనలోకి వచ్చినా? చివరికి -బింబిసార- ఫేం వశిష్ట వైపు నందమూరి బాలకృష్ణ మొగ్గు చూపారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై నందమూరి అభిమానుల్లో.. సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మోక్షజ్ఞ తొలి సినిమా కావడంతో ప్రాజెక్ట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించేందుకు వశిష్ట ప్రత్యేక కసరత్తులు చేస్తున్నారు. కథా చర్చల దగ్గరి నుంచి ప్రతీ విషయంలోనూ బాలయ్య స్వయంగా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. అయితే మోక్షజ్ఞ లాంచ్ పర్ఫెక్ట్‌గా ఉండాలనే ఉద్దేశంతో సినిమాలో బాలకృష్ణ గెస్ట్ అప్పీయరెన్స్ ఇవ్వబోతున్నారనే వార్త ఫిలింనగర్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ గెస్ట్ రోల్ కేవలం సినిమాకు ఒక పవర్ ప్యాక్డ్ టేకాఫ్ లాగా మాత్రమే ఉంటుందని తెలుస్తోంది. 100 సార్లు అడిగితే గానీ.. సాధారణంగా స్టార్ హీరో వారసుడి లాంచ్ సినిమాలో కనిపిస్తే ఆ క్రేజ్ నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుంది. అయితే స్క్రీన్ మీద బాలకృష్ణే ఎక్కువ సేపు కనిపిస్తే? అది డెబ్యూ హీరో అయిన మోక్షజ్ఞకు మైనస్‌గా మారుతుందనే జాగ్రత్తను వశిష్ట ముందుగానే ప్లాన్ చేసినట్లు సమాచారం. సీనియర్ హీరో స్థాయికి తగినట్లుగా సినిమా మొత్తం ఉంటే? కొత్త హీరో ఎలివేషన్ తగ్గే ప్రమాదం ఉందని భావించిన దర్శకుడు బాలయ్య పాత్రను కేవలం ఒక మెరుపులా.. సరిగ్గా ఇంట్రడక్షన్ కీలకమైన టేకాఫ్ సన్నివేశాలకే పరిమితం చేయాలని నిర్ణయించుకున్నారట. ఈ గెస్ట్ రోల్ ద్వారా సినిమాకు కావాల్సినంత హైప్ రావడం ఖాయమని.. అదే సమయంలో మోక్షజ్ఞకు పూర్తి స్థాయి హీరోగా ప్రతిభను ప్రదర్శించడానికి తగినంత స్పేస్ దొరుకుతుందని తెలుస్తోంది. నందమూరి అభిమానుల అంచనాలను నిలబెడుతూనే మోక్షజ్ఞ సోలో హీరోగా టాలెంట్‌ను నిరూపించుకోవడానికి ఈ ప్లానింగ్ ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నారుట. నందమూరి నట వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లే బాధ్యత మోక్షజ్ఞ మీద ఉండటంతో ఆయన మేకోవర్, డ్యాన్సులు, యాక్షన్ సీక్వెన్స్‌ల విషయంలో ప్రత్యేక శిక్షణ ఇప్పించినట్లు తెలుస్తోంది. సినిమా ప్రారంభం నుండి ఎంతో పకడ్బందీగా స్క్రిప్ట్ వర్క్ జరుపుకున్న ప్రాజెక్ట్ పై అంచనాలు అంతకంతకు పెరుగుతున్నాయి. బాలయ్య ఇచ్చే ఆ చిన్న మెరుపు సినిమాకు బిగ్గెస్ట్ ఓపెనింగ్స్‌ను తెచ్చిపెట్టడంలో కీలక పాత్ర పోషిస్తుందని..ఆ తర్వాత సినిమాను పూర్తిగా మోక్షజ్ఞ తన భుజాలపై మోస్తారని తెలుస్తోంది.

# నాలుగు రోజుల్లోనే రూ.400 కోట్ల క్లబ్‌లోకి రజనీ..

## ఓవర్సీస్‌లో 'ధురంధర్ 2' రికార్డు బద్దలు!



సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'జైలర్ 2' బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. విడుదలైన నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 424.25 కోట్ల వసూళ్లు సాధించింది. దీంతో రూ. 400 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టింది. మరోవైపు 2026లో భారతీయ సినిమాల్లో ఓవర్సీస్ తొలి రోజు అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ఈ క్రమంలో రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్ 2'ను వెనక్కి నెట్టింది.

ఆదివారం ఒక్కరోజే 'జైలర్ 2' భారత్‌లో రూ. 55.85 కోట్ల నెట్ వసూళ్లు సాధించింది. శనివారం వచ్చిన రూ. 47.25 కోట్లతో పోలిస్తే ఆదివారం వసూళ్లు 18.2 శాతం పెరిగాయి. విడుదలైన తొలి రోజు రూ. 59.70 కోట్లు రాబట్టిన ఈ చిత్రం.. రెండో రోజు రూ. 37.10 కోట్లకు పరిమితమైంది. ఆ తర్వాత వారాంతంలో మళ్లీ పుంజుకుంది.ఇప్పటివరకు భారత్‌లో ఈ సినిమా నెట్ వసూళ్లు రూ. 199.90 కోట్లకు చేరాయి. పన్నులతో కలిపిన దేశీయ వసూళ్లు రూ. 234.25 కోట్లు కాగా.. విదేశాల్లో రూ. 190 కోట్లు రాబట్టింది. దీంతో ప్రపంచవ్యాప్త వసూళ్లు రూ. 424.25 కోట్లకు చేరినట్లు ట్రేడ్ అంచనాలు చెబుతున్నాయి.విదేశీ మార్కెట్లో తొలి రోజు వసూళ్లలో 'జైలర్ 2' సుమారు రూ. 57 కోట్లు సాధించింది. 'ధురంధర్ 2' తొలి రోజు రాబట్టిన రూ. 52 కోట్లను అధిగమించింది. ఈ జాబితాలో రామ్‌చరణ్ నటించిన 'పెద్ది' రూ. 28 కోట్లతో మూడో స్థానంలో ఉంది. విజయ్ 'జన నాయగన్' రూ. 27.50 కోట్లు, మలయాళ చిత్రం 'దృశ్యం 3' రూ. 25 కోట్లతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

ఆదివారం వసూళ్లలో తమిళ వెర్షన్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ భాషలో రూ. 39.95 కోట్ల నెట్ వసూళు వచ్చాయి. తెలుగు వెర్షన్ రూ. 9.50 కోట్లు, హిందీ వెర్షన్ రూ. 5.75 కోట్లు, కన్నడ వెర్షన్ రూ. 65 లక్షలు రాబట్టాయి. అన్ని భాషల్లో కలిపి 15,473 ప్రదర్శనలకు సగటున 62 శాతం ఆక్యుపెన్సీ నమోదైంది. నాలుగు రోజుల్లోనే భారీ వసూళ్లు సాధించిన 'జైలర్ 2'కు ఇప్పుడు అసలు పరీక్ష మొదలుకానుంది. వారాంతపు జోరును వారం మధ్యలోనూ కొనసాగిస్తుందా? అనేది ఆసక్తికరంగా మారింది.



# పండుగ కళ ఉట్టిపడేలా శ్రీలీల వైబ్స్ దసరా వైబ్స్

దసరా వైబ్స్ ఒక రోజు ముందే వచ్చేసాయి. శ్రీలీల తన తాజా ట్రెడిషనల్ లుక్‌తో దసరా వైబ్స్ ని క్రియేట్ చేసింది. సోషల్ మీడియాలో మరోసారి అందరినీ మంత్రముగ్ధులను చేసింది. సంప్రదాయబద్ధమైన దుస్తులలో మెరిసిపోతూ.. పండుగ శోభను.. దసరా నవరాత్రుల కళను పర్ఫెక్ట్‌గా ప్రతి బింబించింది. నదిటిన బొట్టు.. క్లాసిక్ ఆభరణాలు.. రాజసం ఉట్టిపడే స్టైలింగ్‌తో డివైన్ బ్యూటీలా అలరించింది. ఈ ఫోటోలు పోస్ట్ చేసిన కొద్ది నిమిషాల్లోనే కామెంట్ సెక్షన్ అభిమానుల ప్రేమతో, హార్ట్ ఎమోజీలతో నిండిపోయింది. తోటి సినీ ప్రముఖులతో పాటు లక్షలాది మంది ఫ్యాన్స్ -అందాల దేవత-, -ఎథీరియల్ క్వీన్- అంటూ ప్రశంసలు కురిపించారు. నెటిజన్లు తన అందమైన నవ్వుకి, ఆకర్షణీయమైన చూపులకు ఫిదా అవుతూ కామెంట్ల రూపంలో తమ అభిమానాన్ని చాటుకున్నారు. వెస్ట్రన్ వేర్ అయినా.. ట్రెడిషనల్ వేర్ అయినా తనదైన శైలిలో క్యారీ చేయడంలో శ్రీలీల దిట్ట. ఇండియన్ సినీ పరిశ్రమలో అత్యంత వర్సటైల్ ఫ్యాషన్ ఐకాన్లలో ఒకరిగా నిలిచిన ఈ భామ ఈ కొత్త ఫోటోషూట్‌లో ఎంతో సహజమైన ఎక్స్‌ప్రెషన్స్‌తో అలరించింది. క్లాసిక్ డిజైన్స్, మోడర్న్ టచ్‌ను సమన్వయం చేస్తూ ఈ అవుట్‌ఫిట్ ట్రెండింగ్‌గా మారింది. ఈ పండుగ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవ్వడమే కాకుండా శ్రీలీలకున్న స్టార్ పవర్‌ను మరోసారి నిరూపించింది. తన గ్లామర్, ఎనర్జిటిక్ యాక్టింగ్‌తో టాలీవుడ్ - సౌత్‌లో క్రేజీ హీరోయిన్‌గా దూసుకుపోతున్న ఈ బ్యూటీ తన ప్రతి లుక్‌తోనూ...వరుస సినిమాలతోనూ ఫ్యాన్స్ అంచనాలను మరింత పెంచేస్తోంది.

# స్టోరీ రివీల్ చేసిన విశ్వక్ సేన్!



సాధారణంగా ఒక సినిమా తెరకెక్కుతోంది అంటే కచ్చితంగా సినిమా అందరూ చూడాలి. అప్పుడే నిర్మాతకు డబ్బులు వస్తాయి.. అయితే కొంతమంది ఫ్యామిలీ ఆడియన్స్ ను టార్గెట్ గా చేసుకొని సినిమాలు చేస్తూ కోట్లు కొల్లగొడుతుంటే.. మరి కొంతమంది మాస్ ఆడియన్స్ ను దృష్టిలో పెట్టుకొని సినిమాలు చేస్తూ సక్సెస్ అవుతున్నారు. అయితే ఇక్కడ తాను కూడా ఇందుకు అతీతం కాదు అని, తాను ప్రత్యేకించి జెన్జీ యువతను టార్గెట్ గా చేసుకొని సినిమా చేశాను అంటూ స్పష్టంగా వివరణ ఇచ్చారు విశ్వక్ సేన్ .. అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం ఫలక్నుమా దాస్ సినిమా తర్వాత అంతే కసితో కోపంతో తీస్తున్న చిత్రం కల్ట్ అని చెప్పిన విశ్వక్ సేన్.. అసలు ఈ సినిమా ఎవరిని టార్గెట్ గా చేసుకొని చేస్తున్నారు అనే విషయంపై కూడా క్లారిటీ ఇచ్చారు. అసలు విషయంలోకి వెళ్తే.. కథ, స్క్రీన్ ప్లే, డైరెక్టర్, నటుడిగా నటిస్తూ ప్రేక్షకుల ముందుకు రాబోతున్న చిత్రం కల్ట్. ఈ సినిమా ట్రైలర్ ను రీసెంట్ గా విడుదల చేశారు. ఈ సందర్భంగా విశ్వక్ సేన్ మాట్లాడుతూ.. "జెన్ జీ ను టార్గెట్ గా చేసుకొని తీసిన సినిమా కల్ట్. ఇది ప్రతి ఒక్కరి కోసం తీసిన సినిమా కాదు.. ఈ విషయం నాకు స్పష్టంగా తెలుసుప్రతి ఒక్కరిని క్యాటగరైజ్ చేసుకుని తీసిన సినిమా కాదు. నాకు క్లియర్ విజన్ ఉంది . నేను కచ్చితంగా యువతను, జెన్ జీ ను టార్గెట్ గా చేసుకొని ఈ కల్ట్ సినిమా తెరకెక్కిస్తున్నాను. ముఖ్యంగా ప్రాజెక్టు ఎక్స్, స్క్విడ్ గేమ్ కలిస్తే కల్ట్. ఈ రెండు నా ఫేవరెట్ చిత్రాలు.. ఈ రెండు చిత్రాలను కలిపి తీసిన సినిమానే కల్ట్. గోవాలో ఒక ఇన్సిడెంట్ జరిగినప్పుడు.. నేను చాలా బాధపడ్డాను.. అక్కడ ఇద్దరు తెలుగు వాళ్ళను కొట్టి చంపేశారు. ముఖ్యంగా ఆ అంశం నన్ను మరింతగా ఆలోచింపజేసింది. ఆ తర్వాత కూడా గోవాలో నాన్ లోకల్ వాళ్లను ఎలా ట్రీట్ చేస్తారో చాలామందికి తెలుసు. నేను ఈ క్యారెక్టర్ రాస్తున్నప్పుడు మధ్యలో నాకు ఈ సంఘటన మరింత కలిచి వేసింది. ఈ సినిమాలో నేనొక పోలీస్ ఆఫీసర్ పాత్ర పోషిస్తున్నాను. హైదరాబాదులో ఒక పోలీసు ఉంటాడు. మధ్యలో ఈ ఇన్సిడెంట్ వచ్చినప్పుడు ఆట మరో లెవెల్ కి వెళ్తుంది. ఈ డిఎస్పి సంకల్ప నాయక్ (విశ్వక్ సేన్) అనే వ్యక్తి హైదరాబాదు నుండి కావాలని గోవా కి పోస్టింగ్ తీసుకొని వెళ్తాడు. నాన్ లోకల్ ను ఎవరైనా కొడితే.. ఈ డిఎస్పి వాళ్ళని కొడుతూ ఉంటాడు. స్టెరాయిడ్స్ తీసుకున్న వ్యక్తి ఎలా ప్రవర్తిస్తాడో అలా.. ఇదే ఈ సినిమా.. అంటూ స్టోరీ కూడా రివీల్ చేశారు విశ్వక్ సేన్. చాలా క్లియర్ గా యువత, జెన్ జీ కోసమే ఈ మూవీ చేశానని, ఆయన క్లారిటీ ఇవ్వడం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇకపోతే ఇంతకు ముందు విడుదల చేసిన టీజర్ లో స్టోరీ గురించి చెబితే.. తాజాగా విడుదల చేసిన ట్రైలర్ లో చూపించిన రక్తపాతం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. ముఖ్యంగా సెన్సార్ హద్దులను మీరుతూ ఆర్.రేటెడ్ మూవీగా టాలీవుడ్ లో తెరకెక్కుతోందంటూ చెబుతున్న ఈ సినిమా అసలు జెన్ జీను ఏ విధంగా ఆకట్టుకుంటుందో చూడాలి.

# తెలంగాణ కోడలిని అంటూ నేషనల్ క్రష్ సగర్వంగా!



పాన్ ఇండియా లో స్టార్ హీరోయిన్‌గా వెలిగిపోతున్న నేషనల్ క్రష్ రష్మిక మందన్న మరోసారి వినయంతో అభిమానుల హృదయాలను గెలుచుకున్నారు. ప్రస్తుతం వరుసగా సినిమాలతో బిజీగా ఉండే కథానాయికల్లో ఒకరిగా ఉన్నా? సాంప్రదాయాలకు, స్థానిక సంస్కృతికి రష్మిక ఇచ్చే గౌరవం అందరినీ ఆకట్టుకుంటోంది. తాజాగా తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ వేడుకల్లో రష్మిక పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్థానిక తెలంగాణ మహిళలతో కలసి రష్మిక ఎంతో ఉత్సాహంగా బతుకమ్మ ఆడటం అక్కడ ఉన్న వారందరినీ ఆశ్చర్యానికి.. ఆనందానికి గురిచేసింది. సాంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోతూ ఎలాంటి ఆర్భాటాలు లేకుండా సామాన్య మహిళలతో కలిసి పాటలు పాడుతూ అడుగులు వేస్తూ వేడుకలను జరుపుకున్నారు. దేశవ్యాప్తంగా క్రేజ్ ఉన్న ఒక స్టార్ హీరోయిన్ ఇలా వీధిలో అందరితో కలిసిపోవడం, స్థానిక పండుగలో పాలుపంచుకోవడం ఆమెలోని ఎంతో సింపుల్ స్వభావాన్ని ఆవిష్కరించింది. -నేను తెలంగాణ కోడలిని. తెలంగాణ ఇంటి ఆడపడుచునని చెప్పుకోవడానికి ఎంతో గర్వపడుతున్నాను- అని సంతోషంగా ప్రకటించారు. ఇక్కడి ప్రజలు చూపించే ఆప్యాయత, ప్రేమ తనకు ఎంతో ప్రత్యేకమైనవని, ఈ నేలతో తనకున్న అనుబంధం మాటల్లో చెప్పలేనిదని భావోద్వేగంతో వెల్లడించారు. ఈ మాటలు విన్న తెలంగాణ ప్రజలు, అభిమానులు ఆమెపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. సంస్కారవంతంగా ఉండటం చూసి విజయ్ దేవరకొండ నిజంగా ఎంతో లక్కీ అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. విజయ్ దేవరకొండ కుటుంబంతో.. ఆయన మూలాలతో రష్మికకు ఉన్న అనుబంధం గురించి ఇండస్ట్రీలో ఎప్పటినుంచో ఆసక్తికరమైన చర్చలు ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రష్మిక తెలంగాణ సంస్కృతిని తన సొంత సంస్కృతిగా భావించి ఇంత గౌరవంగా బతుకమ్మ ఆడటం వారి బంధానికి మరింత అందాన్ని తెచ్చిపెట్టింది. ప్రస్తుతం గ్లామర్ ప్రపంచంలో చాలామంది స్టార్లు తమ చుట్టూ ఒక ప్రత్యేకమైన సరిహద్దులను ఏర్పరచుకుని సామాన్యులకు దూరంగా ఉంటారు. కానీ రష్మిక మాత్రం తన వద్దకు వచ్చే అభిమానులతో, సామాన్య ప్రజలతో ఎంతో ఆప్యాయంగా మెలుగుతూ ఉంటారు. పాన్ ఇండియా రేంజ్‌లో భారీ బడ్జెట్ సినిమాలు చేస్తున్నా? భారతీయ మూలాలను మర్చిపోకుండా ఇలా సాంప్రదాయ వేడుకలకు ప్రాధాన్యత ఇవ్వడం రష్మిక ప్రత్యేకతను చాటిచెబుతోంది. మొత్తానికి బతుకమ్మ పండుగ సందర్భంగా రష్మిక చూపించిన ఆప్యాయత, సింప్లిసిటీ తెలంగాణ మహిళల మనసులను దోచుకున్నాయి. తెలంగాణ సాంప్రదాయాన్ని ఇంత గొప్పగా గౌరవిస్తూ తెలంగాణ కోడలిని అని గర్వంగా ప్రకటించిన రష్మికకు స్థానిక ప్రజలు... అభిమానుల నుంచి మద్దతు లభిస్తోంది.